సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



గాంధీ సూక్తిని మరువొద్దు

వినియోగదారుల గురించి జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన సూక్తిని మరవొద్దని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు.

- 8లో▸



అద్భుతాలకు నిలయం..

అద్భుతాలకు నిలయం రామప్ప దేవాలయమని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు పాపారావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$32.9^0 / 28.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గాంధేయమార్గంలో నడుచుకోవాలి

- ఎస్పీ చంద్రమోహన్



మహబూబాబాద్ రూరల్: దేశ పౌరులు గాంధేయమార్గంలో నడుచుకోవాలని, గాంధీ చూపిన బాటలో పోలీసులు విధులు నిర్వర్తించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీ చంద్రమోహన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ ప్రపంచానికి సత్యం, అహింస మార్గాలను చూపారన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వన్యప్రాణి సంరక్షణ' ర్యాలీ



కొత్తగూడ: వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలకేంద్రంలో అటవీశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని అన్నారు. జీవ సమతుల్యత ఉన్నప్పుడే భావితరాల మనుగడ సాధ్యమన్నారు. అది దెబ్బతినడం వల్లే అతివృష్టి, అనావృష్టి, వైరస్ సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతులై అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈర్యాలీలో ఎఫ్ఆర్వో వజరహత్, రేంజ్ సిబ్బంది, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయ బదిలీలు గందరగోళంగా మారాయని 'ఆత్మలకు పిలుపు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు వస్తాయన్నారు. శాశ్వత దివ్యాంగ ఉపాధ్యాయులకు మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేదని, పాత సర్టిఫికెట్లతోనే వెరిఫికేషన్ చేస్తామన్నారు. ప్రమోషన్లకు సంబంధించిన సీయారిటీ జాబితాను సరిచేసి కొత్త లిస్టు తయారు చేస్తామన్నారు. ప్రమోషన్లు, బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని, జిల్లాలోని ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఆర్టీసీ డీఎం విజయ్ బదిలీ

నెహ్రూసెంటర్: ఆర్టీసీ మానుకోట డిపో మేనేజర్ జె.విజయ్ బదిలీపై హయత్‌నగర్ డిపోకు వెళ్లనున్నారు. కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.శివప్రసాద్ మానుకోట డిపో మేనేజర్‌గా రానున్నారు.

'అనర్హులకు 'గృహలక్ష్మి' ఇళ్ల మంజూరు'

కేసముద్రం: అనర్హులకు గృహలక్ష్మి పథకం ఇళ్లను మంజూరు చేసి.. అర్హులకు అన్యాయం చేశారంటూ గ్రామసభ వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామసభ నిర్వహించారు. అయితే ఇటీవల గృహలక్ష్మి పథకం ఇళ్ల మంజూరు జాబితాలో 20 మంది పేర్లు వచ్చాయి. ఈ మేరకు గ్రామంలోని ఓ వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు కలిసి జీపీ వద్దకు చేరుకుని, అర్హులమైన తమకు గృహలక్ష్మి ఇళ్లను ఎందుకు మంజూరు చేయలేదంటూ అక్కడున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శిని ప్రశ్నించారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు అనర్హులను ఎంపిక చేశారని, దీంతో అర్హులమైన తమకు అన్యాయం జరిగిందంటూ వారు ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే ఇళ్లు ఎలా మంజూరు చేస్తారని ఆందోళనకారులు ప్రశ్నించారు. గ్రామంలో 120 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి విడతలో 20 మందిని ఎంపిక చేశామని, రెండో విడతలో మిగిలిన వారిని ఎంపిక చేస్తామని సర్పంచ్ సారయ్య, కార్యదర్శి రంజిత్ చెప్పుకొచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

ఆశలు.. ఆవిరి

ఏడాదిగా పత్తిని ఇంట్లోనే దాచిన రైతులు

- ధర తగ్గుతుండడంతో.. తక్కువ రేటుకే అమ్ముకుంటున్న వైనం
- క్వింటాకు సుమారు రూ.3వేల చొప్పున నష్టం
- అప్పుడే అమ్మితే బాగుండు అంటున్న రైతన్నలు



ఇటీవల కేసముద్రం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పాత పత్తి

కేసముద్రం: ధర పెరుగుతుందనే ఆశతో రైతులు భారీగా పత్తిని ఇళ్లల్లో నిల్వ చేశారు. గతేడాది పండించిన తెల్లబంగారాన్ని దాచిపెట్టారు. అయితే ప్రస్తుతం ధర తగ్గడం, కొత్త పత్తి వస్తుండడంతో గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. దీంతో క్వింటాకు రూ.3వేల చొప్పున రైతులు నష్టపోతున్నారు.

అధిక ధర ఆశతో..

రెండేళ్ల క్రితం పత్తి ధర క్వింటాకు రూ.13వేలకు పైగా పలికింది. దీంతో గతేడాది ఎక్కువశాతం మంది రైతులు పత్తి సాగుపై దృష్టిసారించారు. తీరా పంట చేతికందాక మార్కెట్‌లో ధర తగ్గుముఖం పట్టింది. వ్యవసాయ మార్కెట్‌లో 2022 ఆగస్టు, సెప్టెంబర్ పత్తి సీజన్ ప్రారంభంలో క్వింటాకు గరిష్ట ధర రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు పలుకగా, ఆ తర్వాత క్రమంగా ధర తగ్గింది. దీంతో రైతులు పండించిన పత్తిలో కేవలం 30శాతం వరకే గత సంవత్సరం మార్కెట్‌లో విక్రయించారు. కాగా ఏడాదిగా ఎదురుచూసిన రైతులు ఇక ధర పెరగదనే ఉద్దేశంతో దాచిపెట్టిన పత్తిని రెండు నెలల నుంచి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రెండు నెలల్లో 30వేల క్వింటాళ్ల పత్తిని విక్రయించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మరో 30 క్వింటాళ్ల వరకు విక్రయిస్తారని అంచనా వేస్తున్నారు. కాగా ఏడాదికాలంగా దాచిపెట్టిన కారణంగా పత్తి బరువు కూడా తగ్గడంతో తీవ్రంగా నష్టపోయామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడి ఫీజు కోసం అమ్ముకున్నా..



పత్తి ధర క్వింటాకు రూ.13 వేల వరకు పలుకుందనే ఆశతో నాకున్న ఎకరం భూమిలో పంట సాగుచేశా. అకాల వర్షాలతో పత్తి జాలుపట్టింది. 5 క్వింటాళ్ల పత్తి చేతికి వచ్చింది. మార్కెట్‌లో అమ్ముదామంటే గిట్టుబాటు ధర లేదని ఇంట్లో దాచిపెట్టిన. ఏడాది గడిచినా ధర లేకపోవడంతో పిల్లల చదువు కోసం బడి ఫీజు కట్టాల్సి ఉంది. అందుకే ఇంట్లో దాచిన 5 క్వింటాళ్ల పత్తిని మార్కెట్‌లో అమ్ముదాని తీసుకువచ్చా. క్వింటాకు రూ.7,189కే ఖరీదు చేశారు. పోయినేడే అమ్మితే క్వింటాకు రూ.2వేలు కలిసొచ్చేది. ఇప్పుడు అమ్మడం వల్ల ధరతోపాటు, పత్తి బరువు తగ్గడంతో నష్టమే మిగిలింది. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి రాలే.

- కె.శ్రీను, రైతు, కేసముద్రం విలేజ్

అప్పుడే అమ్మితే బాగుండేది..



గతేడాది నాకున్న రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. మొత్తంమీద 13 క్వింటాళ్ల పత్తి చేతికొచ్చింది. పోయినేడు 3 క్వింటాళ్ల గుడ్డి పత్తిని మార్కెట్‌లో అమ్మితే క్వింటాకు రూ.8,270 చొప్పున కొన్నరు. ధర పెరుగతదని ఏడాదిగా ఇంట్లో దాచిపెట్టిన. పంటలకు పెట్టుబడుల కోసం దాచిన పత్తిని అమ్ముదామని మార్కెట్‌కు తీసుకువచ్చా. క్వింటా పత్తిని రూ.7,156కు ఖరీదు చేశారు. ఇప్పుడు అమ్మిన మంచి పత్తి కంటే, గత సంవత్సరం అమ్మిన గుడ్డి పత్తికే ధర ఎక్కువ పలికింది. ఇన్నిరోజులు దాచిన పత్తిని అప్పుడే అమ్మితే బాగుండేది.

- గుంటుక యాకయ్య, రైతు, అలంకానిపేట

తీరొక్క చీరలు



జిల్లాకు చేరిన బతుకమ్మ చీరలు

- జిల్లాకు చేరిన 2,99,713 బతుకమ్మ చీరలు
- త్వరలో పంపిణీకి ఏర్పాట్లు

మహబూబాబాద్ అర్బన్: బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోంది. పండుగ సమీపిస్తుండడంతో ఈసారి 240 ఆకర్షణీయమైన డిజైన్లలో 30 రంగుల్లో చీరలను తయారు చేశారు. కాగా జిల్లాకు 2,99,713 చీరలు చేరుకున్నాయి. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అర్హుల జాబితాను సిద్ధం చేశారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు, సెర్ప్, మెప్మా, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్‌శాఖ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యుల సహకారంతో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ మహిళకు..

గత ఏడాది మాదిరిగా 18ఏళ్ల పైబడిన యువతులతో పాటు తెల్లరేషన్‌కార్డు కలిగిన ఎస్‌హెచ్‌జీ సభ్యులందరికీ చీరలు అందజేయనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలోని గోడౌన్‌లకు చేరుకున్నాయి. అక్కడి నుంచి మండలాలు, గ్రామాలకు సరఫరా చేస్తారు. పంపిణీ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

మండలాల వారీగా చీరలు వివరాలు..

బయ్యారం	17,924
చిన్నగూడూరు	6,078
దోర్నకల్	20,207
గంగారం	4,282
గార్ల	14,008
గూడూరు	22,378
కేసముద్రం	28,399
కొత్తగూడ	10,864
కురవి	25,732
మహబూబాబాద్	40,703
మరిపెడ	26,518
నర్సింహులపేట	10,966
దంతాలపల్లి	12,326
నెల్లికుదురు	20,270
పెద్దవంగర	11,420
తొర్రూరు	27,638
మొత్తం	2,99,713

అర్హులకు చీరలు



ఇప్పటికే 18 ఏళ్లు నిండిన వారి జాబితాను సిద్ధం చేశాం. జిల్లాలో రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశాం. జిల్లాకు బతుకమ్మ చీరలు చేరుకున్నాయి. చీరలను గోడౌన్‌లో భద్రపరిచాం. త్వరలో బతుకమ్మ చీరలను పంపిణీకి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ

గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం

- మంత్రి సత్యవతిరాథోడ్



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: మహాత్మాగాంధీ జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్‌బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఎస్పీ చంద్రమోహన్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గాంధీ బోధనలు ప్రపంచ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, ఆర్డీఓ అలివేలు, తహసీల్దార్ ఇమ్మానియల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కులవృత్తులకు జీవం

కులవృత్తులకు ప్రభుత్వం జీవం పోస్తుందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, బంజారా భవన నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. తర్వాత కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీబంధు పథకం కింద ఎంపికైన కొత్తగూడ, గంగారం మండలాల లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం డీడీలను అందజేసి మాట్లాడారు. గిరిజన ఓట్ల కోసమే పీఎం నరేంద్రమోదీ మోసపూర్తి వాగ్దానాలు చేస్తున్నారని, ట్రైబల్ యూనివర్సిటీ ప్రకటన ఒక కుట్ర అని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో కృష్ణ జింక విగ్రహాన్ని ఆవిష్కరించారు. పలువురు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు.

క్రమశిక్షణకు మారుపేరు జైళ్లశాఖ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సురేష్

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ జైళ్లశాఖ క్రమశిక్షణకు మారుపేరు అని సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి అన్నారు. మహాత్మాగాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహబూబాబాద్ జైలు అధికారుల ఆహ్వానం మేరకు న్యాయమూర్తులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జైలర్ మల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి జడ్జిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఖైదీల హక్కులు, భద్రత విషయంలో తెలంగాణ జైళ్లశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ప్రశంసించారు. విచారణ ఖైదీలుగా శిక్షను అనుభవిస్తున్న వారికి జైల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు వారి మానసికోల్లాసానికి యోగా, ధ్యానం, శరీర దారుఢ్యానికి ఆటలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని జైలు అధికారులను ప్రశంసించారు. ఖైదీలు బాహ్య ప్రపంచంలో అడుగు పెట్టిన తర్వాత గాంధీసూచించిన మార్గంలో తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. జైల్లో ఖైదీలకు నిర్వహించిన ఆటలపోటీలు, పరిశుభ్రత వంటి వాటిల్లో గెలుపొందిన వారికి షీల్డ్‌లతో పాటు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది వల్లపు యాదగిరి, జైలు అధికారులు మద్దెల రవీందర్, పట్టెం భిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, హెడ్ వార్డర్లు ఇష్తికార్ అహ్మద్, బుల్లెట్ వెంకన్న, మహ్మద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తండా రోడ్లకు నిధులు

- మహబూబాబాద్, జనగామ జిల్లాలకు రూ.12.95కోట్లు
- నిధులు విడుదల చేసిన గిరిజన సంక్షేమశాఖ

సాక్షి, మహబూబాబాద్: గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ నిధులు విడుదల చేసింది. మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో 13.6కిలోమీటర్ల నిర్మాణాలకు రూ.12.95కోట్లు విడుదల చేస్తూ ఆశాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ సెప్టెంబర్ 27న జీఓ జారీ చేశారు. కాగా మహబూబాబాద్ జిల్లా మానుకోట మండలం బోరింగ్ తండా బీటీరోడ్డు నుంచి ముడుపుగల్లు రోడ్డు వరకు 2.5కిలో మీటర్లకు రూ.2కోట్లు, జాతీయ రహదారి 365 నుంచి రజాల్‌పేట రోడ్డు మీదుగా మంగళ కాలనీ వరకు 1.10కిలో మీటర్లకు రూ. 3కోట్లు మంజూరు చేశారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం జాతీయ రహదారి 163నుంచి సీట్యాతండా, ఆదిముసీం రాయవరం వరకు 1.60కిలోమీటర్లకు రూ.1.25కోట్లు, రఘునాథపల్లి మండలం ఆర్‌అండ్‌బీరోడ్డు పాట్టగుబ్బతండా మీదుగా సోమ్‌రాజ్‌తండా, అనుశాలతండా వరకు 3.90కిలో మీటర్లకు రూ.3.20కోట్లు మంజూరు చేశారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరి నుంచి చెరువు ముందుతండా వరకు 2 కిలోమీటర్లకు రూ.1.50కోట్లు, తాళ్లపూసపల్లి నుంచి రాజ్యాతండా, ఎస్సారెస్పీ కాల్వ తాళ్లపూసపల్లి వరకు 2.50కిలోమీటర్లకు రూ.2కోట్లు మంజూరు చేశారు.

వరంగల్‌పై ఎన్ఐఏ గురి!

పౌరహక్కులు, ప్రజా సంఘాల నేతలపై ఆరా

- 2022 ఆగస్టు 19న బీరెల్లి కుట్రకేసు.. హరగోపాల్ సహా 152 మందిపై నమోదు
- 2023 జూన్‌లో వెలుగు చూసిన వైనం.. ఐదుగురిపై కేసులు ఎత్తివేత
- 'కవర్ సంఘాల' పేరిట ఏడాది కిందట సోదాలు
- సోమవారం తిరిగి మళ్లీ దాడులు



ఎన్ఐఏ సోదా చేసిన సముద్రాల అనిత ఇల్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉద్యమాలకు కేరాఫ్ అయిన వరంగల్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గురిపెట్టింది. సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు, తర్వాత విప్లవ రాజకీయాలకు అడ్డాగా మారిన ఈ ప్రాంతంలో కార్యకలాపాలపై ఆరా తీస్తోంది. పౌరహక్కులు, ప్రజాసంఘాల కార్యకలాపాలు, నాయకుల కదలికలపై నిఘా పెట్టింది. ఈ మేరకే ఎన్ఐఏ వరంగల్ నగరంతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల తరచూ సోదాలు నిర్వహిస్తోంది. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి మండలం బీరెల్లి అడవుల్లో మావోయిస్టు అగ్రనేతలతో సమావేశమైనట్లు సమాచారం ఉందని 152 మందిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత హరగోపాల్ సహా ఆరుగురిపై కేసులు ఎత్తివేయగా.. ప్రొఫెసర్ కాశీం సహా 146 మందిపై విచారణ జరుగుతోంది. గత సెప్టెంబర్‌లో విశాఖపట్నంలో నమోదైన ఓ కేసు విషయంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని సముద్రాల అనిత ఇంట్లో సోదాలు చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 9న కూడా వరంగల్‌లోని ఐదు ప్రాంతాల్లో ఎన్ఐఏ దాడులు నిర్వహించింది. తాజాగా సోమవారం హంటర్‌రోడ్డు, ప్రకాష్‌రెడ్డిపేట, పైడిపల్లిలలో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి సోదాలు చేయడం సంచలనంగా మారింది.

ఓ వైపు 'ఉపా'.. మరోవైపు సోదాలు..

మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వాల వ్యూహంలో భాగంగా ఎన్ఐఏ నిఘా ముమ్మరం చేసింది. ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలపై ఓ వైపు కేసులు.. మరోవైపు ఇళ్లల్లో సోదాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరెల్లి సమీపంలో మావోయిస్టు నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్, ఇతర మావోయిస్టులు సమావేశమవుతున్నట్లు సమాచారం అందడంతో ములుగు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అమాయక గిరిజన యువతను దళంలో చేర్చుకోవడం.. అధికారులు, అమాయక పౌరులను హత్య చేయడం, నిధుల సేకరణ వంటి లక్ష్యాలతో ఈ సమావేశం జరగ్గా, పోలీసుల రాకతో వారంతా పారిపోయారు. ఈ మేరకు పస్రా సీఐ ఫిర్యాదు మేరకు అక్కడ పంచనామా నిర్వహించి ఐపీసీ 120బీ, 147, 148 రెడ్ విత్ 149.. 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)'లోని సెక్షన్లు 10, 13, 18, 20, 38, ఆయుధాల చట్టంలోని సెక్షన్ 25 (1–బీ)(ఎ)ల కింద తాడ్వాయి పోలీసులు 152 మందిపై కేసు నమోదు చేశారు. మావోయిస్టు నేతలు, వారి సానుభూతిపరులు, సమావేశ స్థలం వద్ద లభించిన సాహిత్యంలో ఉన్న ఇతరుల పేర్లపై కేసులు నమోదు చేశారు. 2023 జూన్‌లో ఈ కేసు వెలుగు చూడగా.. ఈ కేసులో ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజా షా, రఘునాథ్, గడ్డం లక్ష్మణ్, గుంటి రవీందర్, సురేష్ కుమార్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు లభించలేదని కేసులు ఎత్తివేశారు. ప్రొఫెసర్ కాశీం, పీఓడబ్ల్యూ నేత సంధ్య, విమలక్క సహా 146 మందిపై కేసు కొనసాగుతుంది. ఇదంతా సద్దు మణిగిన కొద్ది రోజులకే ఉమ్మడి జిల్లాలో ఎన్ఐఏ సోదాలు ఉధృతం చేయడం కలకలం రేపుతోంది.



పైడిపల్లిలో కొత్తకొండ శాంతమ్మ ఇంటిముందు పోలీస్ వాహనం



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన శాంతమ్మ కూతురు సృజన (ఫైల్)



ఇంట్లో ఎన్ఐఏ సోదాల సందర్భంగా పరిశీలించిన పుస్తకాలు

'కవర్ సంఘాల' కట్టడి... అనుమానంతో సోదాలు

మావోయిస్టు పార్టీకి కవర్‌సంఘాలు పని చేస్తున్నాయంటూ పలు ప్రజాసంఘాల నాయకులపై తరచూ కేసులు నమోదు చేస్తున్నారు. విశాఖపట్నం జిల్లాలో రాధ అనే నర్సింగ్ విద్యార్థి కొన్నేళ్ల క్రితం కిడ్నాప్ కాగా.. మావోయిస్టు అనుబంధ సంస్థ చైతన్య మహిళా సంఘం నాయకులే కిడ్నాప్ చేశారని ఆమె తల్లి పోచమ్మ 2017లో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై 2022న ఎన్ఐఏ కేసు టేకప్ చేసింది. ఈ కేసులో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 22మందిపై కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ క్రమంలోనే చైతన్య మహిళా సంఘంలో గతంలో చురుగ్గా పనిచేసిన సముద్రాల అనిత, ఆమె తల్లిగారిళ్లలో గతేడాది సెప్టెంబర్‌లో సోదాలు నిర్వహించారు. తాజాగా సోమవారం కూడా ఆమె ఇంట్లో మళ్లీ సోదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యురాలిగా వ్యవహరిస్తున్న కొత్తకొండ శాంతమ్మ ఇంట్లోనూ ఈసారి ఎన్ఐఏ సోదాలు చేసింది. పైడిపల్లిలోని ఆమె ఇంటిని ఉదయమే పోలీసులు చుట్టుముట్టగా... తర్వాత ఎన్ఐఏ అధికారులు ఇల్లంతా తనిఖీ చేశారు. ఇంట్లో ప్రజాకవి వరవరరావుపై ప్రొఫెసర్ కాశీం రాసిన 'కాగితం మీద అక్షరానికి కమిటైన కవి వరవరరావు', 'జన హృదయం జనార్దన్.. అమరుడు సూరపనేని జనార్దన్' తదితర పుస్తకాలు లభ్యమయ్యాయి. 2016 మార్చి 1న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన శాంతమ్మ కూతురు కొత్తకొండ సృజన అలియాస్ నవత ఫొటోలను పరిశీలించిన అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు నిర్వహించిన ఎన్ఐఏ అధికారులు వివరాలు మాత్రం వెల్లడించలేదు.

అభివృద్ధి చేసినందుకే ఆదరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

దోర్నకల్: దోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినందుకే తనను ప్రజలు ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. డోర్నకల్ మండలంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే రూ.15 కోట్లతో బోడమాంజతండా నుంచి గొల్లచర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.1.5కోట్లతో కంసాలితండా నుంచి బోడహట్యాతండా వరకు బీటీ రోడ్డు పనులకు, కస్నాతండాలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి, బోరింగ్‌తండా నుంచి ఇస్రాతండా వరకు రూ.కోటితో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు, డోర్నకల్‌లో బైపాస్ రోడ్డులో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి, రూ.1.69 కోట్లతో జెడ్పీహెచ్ఎస్ నుంచి బుద్దారం రోడ్డు వరకు నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొడేళ్లగూడెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెరుమాళ్ల సంకీస సీతారామచంద్రస్వామి ఆలయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గొల్లచర్ల, వెన్నారం, తొడేళ్లగూడెం, మన్నెగూడెం, పెరుమాళ్ల సంకీస గ్రామాల్లో పీఎంఎఫ్ఈ పథకం ద్వారా గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు మిల్లులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్నారు. డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, జెడ్పీటీసీ సభ్యురాలు కమలారామనాథం, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ, పీఏసీఎస్ చైర్మన్లు బిక్షంరెడ్డి, సీతారామిరెడ్డి, సర్పంచులు సమ్మిరెడ్డి, రాంబాయి, లెనిన్‌కుమార్, అంజయ్య, రాధిక, ఎంపీటీసీలు శంకర్‌నాయక్, విజయపాల్‌రెడ్డి, ఏపీడీఓ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా టీచర్లపై పోలీసుల తీరు గర్హనీయం

● బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు సాంబమూర్తి

కాజీపేట రూరల్‌ : రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 13 జిల్లాల్లో స్పౌజ్‌ బదిలీలను చేపట్టాలని కోరుతూ గాంధీ మార్గంలో మౌనదీక్ష చేస్తున్న మహిళా ఉపాధ్యాయులపై పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమని బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి అన్నారు. కాజీపేట 48వ డివిజన్‌ దర్గాలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ కార్యాలయం వద్ద శాంతియుత మౌన దీక్షకు వెళ్తున్న స్పౌజ్‌ బాధితులను ఎక్కడికక్కడ అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించడాన్ని బీసీటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అధిక సంఖ్యలో మహిళలు మౌన దీక్షకు తరలిరాగా పోలీసులు ఒక్కసారిగా దూకుడుగా వ్యవహరించిన తీరుతో ఆందోళన కలిగించిందన్నారు. మహిళా ఉపాధ్యాయులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్తున్న తీరును చూసి వారితో కలిసి అక్కడికి వచ్చిన చిన్నారులు భయపడి ఏడ్వడం అందరిని కలిచివేసిందని, ఇప్పటికైనా స్పౌజ్‌ బాధితుల సమస్యలను అధికారులు, పాలకులు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు.

రేపు తపాలా ఉద్యోగుల సమ్మె

హన్మకొండ: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం, సెంట్రల్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన ఒక రోజు సమ్మె చేయనున్నట్లు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్‌ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ సమ్మె చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు హనుమకొండలోని తపాలా డివిజన్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే కమలేష్‌ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ ధర్నాలో గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మావోలకు వ్యతిరేకంగా వెలసిన కరపత్రాలు

వెంకటాపురం(కె): మండలంలోని పాలెం, పాత్రాపురం, వీరభద్రవరం గ్రామ శివారుల్లో సోమవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్యవేదిక పేరుతో కర పత్రాలు వెలిశాయి. 'మాకొద్దు మావోయిస్టు పార్టీ.. మా బతుకులు మమ్ములను బతకనివ్వండి.. మావోయిస్టు పార్టీ ఆదివాసీల అభివృద్ధికి చేసింది ఏమిటి.. మీ వల్ల గ్రామల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు, ప్రభుత్వం మారుమూల ప్రాంతాల అభివృద్ధికి అనేక పథకాలు చేపడుతుంటే మావోయిస్టులు అడ్డుకుంటున్నారని, అమాయక ఆదివాసీ యువతను పార్టీ భావజాలానికి ఆకర్షితులను చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారని' ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య వేదిక పేరుతో కరపత్రాలు వెలిశాయి.

సత్వర సేవలే లక్ష్యం..

రెస్పాన్స్‌ టైం తగ్గించడానికి కృషి

● కొత్త వాహనాలు రావడంతో సేవలు మెరుగు
● అన్నింట్లో అధునాతన టెక్నాలజీ
● కాల్‌ వచ్చిన 30 సెకన్లలో వెహికిల్‌ కదలాలి
● 108, 102 ద్వారా మరింత మెరుగైన సేవలు
● 'సాక్షి'తో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌ పాటి శివకుమార్‌


మాట్లాడుతున్న శివకుమార్‌

హన్మకొండ అర్బన్‌: దివంగత నేత వైఎస్సార్‌ ఆలోచనతో మొగ్గ తొడిగి.. ఇతింతై.. వటుడింతై అన్నట్లు రాష్ట్ర రాజధాని నుంచి మారుమూల పల్లె వరకూ ఎవరు ఆపదలో ఉన్నట్లు సమాచారం అందినా వెంటనే స్పందించి వారిని సురక్షితంగా సంపూర్ణ వైద్య సేవలు అందే ప్రాంతానికి తరలిస్తోంది 108 వాహనం. దీనికి తోడు గర్భిణులు, బాలింతల కోసం 102 వాహనాలు, పశువైద్య సేవల కోసం1962 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. దీనికి తోడు ప్రభుత్వం కూడా వాహనాలు, సిబ్బంది సంఖ్య పెంచడం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి తీసుకొచ్చి సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడంతో వారు ఉత్తమ సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఈ వాహన సర్వీసులు, సేవల మెరుగుకు తీసుకుంటున్న చర్యలు గురించి 108 వాహనాల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌ పాటి శివకుమార్‌ 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లో..

సత్వర సేవలే లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుని అత్యవసర సమయంలో సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రోజురోజుకూ సర్వీసులు మెరుగు పరుచుకోవడానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 108 వాహనాలు 54, నియోనేటల్‌ వాహనాలు 5, 102 వాహనాలు 33, 1962వాహనాలు 9, పార్థివ దేహాలు తరలించే వాహనాలు 4 అందుబాటులో ఉన్నాయి. ఇందులో చాలా వరకు ఇటీవల ప్రభుత్వం అందించిన అధునాతన వాహనాలు ఉన్నాయి. 108 సర్వీసులకు సంబంధించి 160మంది, 102కు 76, పశుసేవలకు 40మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 108 వాహనంలో కనీసం 15సంవత్సరాల అనుభవం ఉన్న సుశిక్షితులైన సిబ్బంది ఉన్నారు.

కొత్త వాహనాల్లో సాంకేతిక పరిజ్ఞానం

ఒక ప్రమాదానికి సంబంధించి 108 కు కాల్‌ చేసినప్పుడు ఆ కాల్‌ సెంట్రల్‌ డెస్క్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి ప్రమాదం జరిగిన స్థలానికి దగ్గరలో ఉన్న 108 వాహనాన్ని వారు అప్రమత్తం చేసి వివరాలు చెప్పి పంపుతారు. ఆ టైమ్‌కు అక్కడ వాహనం అందుబాటులో లేకుంటే పక్కన మరోచోట అందుబాటులో ఉన్న వాహనానికి సమాచారం ఇస్తారు. ఈ విధంగా మాకు సమాచారం వచ్చి తరువాత వాహనం ప్రమాద స్థలానికి చేరుకోవడానికి మన జిల్లాలో ప్రస్తుతం నగర ప్రాంతంలో 18 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 23 నిమిషాలు, గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాలు సరాసరి సమయంగా ఉంది. దీనిని మరింత తగ్గించడానికి కృషి చేస్తున్నాం. ఇక ఇప్పుడు వచ్చిన కొత్త వాహనాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. వాహనాల్లో ఆక్సిజన్‌ సిలిండర్‌, స్ట్రెచర్‌, ఇన్‌స్టెంట్‌ కిట్‌, బీపీ పల్స్‌ చెకప్‌ మిషన్‌ అందుబాటులో ఉంటాయి. దీని వల్ల గోల్డెన్‌ అవర్‌లో పేషెంట్‌ పరిస్థితి అంచనాకు వచ్చి మెరుగైన సేవలు అందే ప్రదేశానికి తరలించొచ్చు. మల్టీచానల్‌ మానిటరింగ్‌ ద్వారా వాహనంలో ఉన్నప్పుడే బీపీ, పల్స్‌, హార్ట్‌ బీట్‌, రెస్పిరేషన్‌ వంటి ఆరోగ్య సమస్యలు ఒకేసారి పరిశీలించే అవకాశం ఉంటుంది. పాయిజన్‌ కేసుల విషయంలో గతంలో ఆస్పత్రికి తరలించిన తరువాతే వైద్యసేవలు అందేవి. ఇప్పుడు అలా కాదు. వాహనంలో ఎక్కించగానే రోగికి వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ వాహనాలు ప్రమాద సమాచారం అందిన 30 సెకన్లలో బయలుదేరాలి. లేదంటే ఆ వెంటనే రెండో సారి ఆలారం మోగుతుంది. ఆ తరువాత ఆలస్యానికి కారణాలపై సమీక్ష, చర్యలు ఉంటాయి.

➡ మాతా శిశు మరణాలు తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం 102 సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చింది. 102 వాహనం సేవలు గర్భిణులు, బాలింతల కోసం వినియోగించుకోవాలి. మూడు నెలల గర్భిణి నుంచి ప్రసవం వరకు, ఆ తరువాత శిశువుకు వ్యాక్సిన్‌ వేయడానికి ఆసుపత్రికి తరలించడానికి ఈ వాహనం సేవలు వినియోగించుకోవాలి.

➡ గర్భిణులు ప్రసవ వేదనతో ఆస్పత్రికి వెళ్లడానికి మాత్రం తప్పని సరిగా 108 సేవలు వినియోగించుకోవాలి. ఆ వాహనంలో అత్యసర సేవలు అందుబాటులో ఉంటాయి.

➡ పశువైద్య సేవల కోసం 1962 నంబర్‌కు కాల్‌ చేస్తే సిబ్బంది వాహనంతో వచ్చి సేవలు అందిస్తారు.

➡ ఇవి ప్రతి నియోజకవర్గాల వారీగా వరంగల్‌కు 3, హనుమకొండ 1, జయశంకర్‌ భూపాలపల్లి 1, ములుగు 1, మహబూబాబాద్‌ 3 చొపున మొత్తం 9 వాహనాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 40 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

వాహనాల వివరాలు..

జిల్లా పేరు	108 వాహనాలు	102	నియో	పశు	ఎఫ్‌ఎస్‌హెచ్‌
హనుమకొండ	14	7	1	1	1
వరంగల్‌	11	8	1	3	1
మహబూబాబాద్‌	12	7	1	3	1
ములుగు	09	8	1	1	-
భూపాలపల్లి	8	3	1	1	-

నాలుగేళ్లలో 108 సేవలు పొందిన వారు..

జిల్లా పేరు	ఏప్రిల్‌2019-మార్చి 20	2020-21	21-22	22-23
హనుమకొండ	13922	14064	16236	17243
భూపాలపల్లి	7114	5501	6923	8549
మహబూబాబాద్‌	13430	12945	15681	16570
ములుగు	10805	10741	13860	14437
వరంగల్‌	12959	10868	12731	17013

వైద్యం వికటించి మహిళ మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
● మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు, తండావాసులు

తొర్రూరు: వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు, తండావాసులు.. మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన డివిజన్‌ కేంద్రం తొర్రూరులో జరిగింది. మండలంలోని అమర్‌ సింగ్‌ తండాకు చెందిన భూక్యా పున్నమ్మ, అమీనా దంపతుల కూతురు సంధ్య (24)కు సూర్యాపేట జిల్లా నూతనకల్‌ మండలం సోమ్లా తండాకు చెందిన గుగులోత్‌ మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. గర్భం దాల్చిన సంధ్య కాన్పు కోసం తల్లిగారి ఇంటికి వచ్చింది. ఆదివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో తల్లిదండ్రులు తొర్రూరు పట్టణంలోని పద్మావతి నర్సింగ్‌ హోమ్‌కు తీసుకువచ్చారు. వైద్యులు అడ్మిట్‌ చేసుకుని ఆపరేషన్‌ చేశారు. సంధ్య బిడ్డకు జన్మనిచ్చింది. ఆపై అధిక రక్తస్రావం కావడంతో వైద్యుడి సలహా మేరకు వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సంధ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పద్మావతి ఆసుపత్రి వైద్యుల నిర్లక్షంతోనే సంధ్య మృతి చెందిందని పేర్కొంటూ బంధువులు, తండావాసులు సోమ వారం తెల్లవారుజామున మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనతో వైద్యుడు యాదగిరి రెడ్డి పరారయ్యారు. ఈ ఘటనపై ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..


నవీన్‌ మృతదేహం

డోర్నకల్‌: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పాత డోర్నకల్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన గాదె నవీన్‌(29) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో చిలుకోడుకు చెందిన దుర్గా అనే హిజ్రాతో పరిచయం ఏర్పడింది. దుర్గా ప్రస్తుతం పాతడోర్నకల్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఈ క్రమంలో నవీన్‌ సోమవారం ఉదయం తన ఇంట్లో కత్తితో పొడుచుకున్నారని దుర్గా చెప్పడంతో చుట్టు పక్కల వారు వచ్చి పరిశీలించగా అతను రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే నవీన్‌ను 108లో మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ బి.ఉపేందర్‌రావు, ఎస్సై ఝూన్సీ ఘటనాస్థలికి చేరుకుని స్థానికులను విచారించారు. అనంతరం హిజ్రా దుర్గా అద్దె ఇంటిని పరిశీలించారు. అనుమానాస్పద స్థితిలో నవీన్‌ మృతి చెందారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ ఉపేందర్‌ తెలిపారు. కాగా, నవీన్‌ భార్య కుమారి స్థానిక ప్రైవేట్‌ పాఠశాలలో టీచర్‌. భర్త మృతి చెందిన విషయం తెలుసుకున్న కుమారి ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించింది. తన భర్త ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లారని, ఫోన్‌ కూడా చేయలేదన్నారు. తన భర్తకు గాయాలయ్యాయని తెలిసి మహబూబాబాద్‌ ఆస్పత్రికి వస్తే విగతజీవిగా కనిపించారని విలపిస్తూ తెలిపింది.

రాజు మృతదేహం లభ్యం

హసన్‌పర్తి/వర్ధన్నపేట : బీఆర్‌ఎస్‌ హసన్‌పర్తి మండల సోషల్‌ మీడియా ఇన్‌చార్జ్‌ తుమ్మల రాజు(30) మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల క్రితం రాజును హత్యచేసి ఎస్సారెస్పీలో పడేసిన విషయం తెలిసిందే. దీంతో రాజు మృతదేహం కోసం మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి సమీపంలోని ఎస్సారెస్పీలో రాజు మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ ఘటనను చూసిన స్థానికులు హసన్‌పర్తి పోలీసులకు సమాచారం అందించగా సీఐ సంజీవ్‌, ఎస్సై అశోక్‌, వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ ఘటనా స్థలికి చేరుకున్నారు. కాళ్లు, చేతులు తాడుతో కట్టి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. కాగా, రాజు మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌ సందర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్‌ అంచూరి విజయ్‌, ఎంపీటీసీ ఇంద్రయ్య తదితరులు ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న ఆర్సీఓ మనోహర్‌రెడ్డి


కబడ్డీ ఆడుతున్న మనోహర్‌రెడ్డి

● ఎంజేపీ గురుకులాల ఆర్సీఓ మనోహర్‌రెడ్డి

కమలాపూర్‌ : క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని, క్రీడాకారులు రెండిటిని సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని ఎంజేపీ గురుకుల విద్యాలయాల సొసైటీ ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఆర్సీఓ మనోహర్‌రెడ్డి సూచించారు. కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో సోమవారం ఎంజేపీ గురుకుల పాఠశాలల (అండర్‌-14), కళాశాలల (అండర్‌-19) బాలుర ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆర్సీఓ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి ఒలింపిక్‌ టార్చ్‌ను వెలిగించి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులతో కలిసి కాసేపు కబడ్డీ ఆడి ఉత్తేజ పరిచారు. పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు, పిరమిడ్స్‌, దేశభక్తి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 17 పాఠశాలలు, 6 కళాశాలల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల హనుమకొండ జిల్లా కన్వీనర్‌ సరిత, ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్‌ ఓడెల మల్లయ్య, ప్రఫుల్లాదేవి, ప్రిన్సిపాల్స్‌ వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్‌, పీఈటీలు నాగరాజు, వెంకటేష్‌, కిశోర్‌కుమార్‌, అధ్యాపకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సూక్తిని మరవొద్దు

● ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌ రావు


గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

హన్మకొండ: వినియోగదారుల గురించి జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన సూక్తిని మరవొద్దని, సిబ్బంది నిరంతరం వారికి అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందజేయాలని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని జరుపుకున్నారు. ముందు గాంధీ చిత్రపటానికి సీఎండీ గోపాల్‌ రావు, డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ స్వచ్ఛత, ఆత్మ నిర్భరం, ధైర్యం, సర్వ మతసమానత్వం, శాంతి, మానవతావాదం.. ఈ అంశాలకు మహాత్మాగాంధీ ప్రతీక అన్నారు. గాంధీ జన్మదినాన్ని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించారన్నారు. సత్యం, అహింస గాంధీ ముఖ్య సాధనాలు అన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీ మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, చీఫ్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌ బి.జనార్దన్‌, సీజీఎంలు బి.అశోక్‌ కుమార్‌, టి.సదర్‌ లాల్‌, మధుసూదన్‌, కిషన్‌, సి.ప్రభాకర్‌, రాజుచౌహాన్‌, కిషన్‌, భీకంసింగ్‌, రవీంద్రనాథ్‌, జాయింట్‌ సెక్రటరీ కె.రమేష్‌, కంపెనీ కార్యదర్శి కె. వెంకటేశం పాల్గొన్నారు.

వర్చువల్‌గా కరీంనగర్‌ మీటింగ్‌ హాల్‌ ప్రారంభం..

టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌.. కరీంనగర్‌లో నిర్మించిన సమావేశ మందిరాన్ని సోమవారం హనుమకొండలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, సీజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపికలు

● డీఐఈఓ గోపాల్‌

విద్యారణ్యపురి/రామన్నపేట : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్‌ జూనియర్‌ కళాశాలలు, ప్రభుత్వ గురుకులాల్లో ఇంటర్మీడియట్‌ చదువుతున్న బాలబాలికలకు 67 ఎస్‌జీఎఫ్‌ఐ అండర్‌-19 విభాగంలో వివిధ క్రీడాపోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఐఈఓ ఎ గోపాల్‌ సోమవారం తెలిపారు. ఈనెల 4,5,6,7 తేదీల్లో వరంగల్‌లోని ఎల్‌బీ జూనియర్‌ కళాశాలలో ఎంపికలు నిర్వహిస్తామని, విద్యార్థులు కచ్చితంగా తమ ఎల్జిబులిటీ ఫామ్‌, కళాశాల గుర్తింపు ఐడీ కార్డులు తీసుకురావాలన్నారు. వయసు నిర్ధారణకు సంబంధించి కూడా క్రీడా వివరాలు జతచేయాలన్నారు. పూర్తి వివరాలకు 9948111994 నంబర్లను సంప్రదించాలని కన్వీనర్‌ గోపాల్‌రావు, మాధవరావు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ బరుపాటి గోపి కోరారు.

ఈక్రీడల్లో ఎంపికలు..

ఈనెల 4న త్రోబాల్‌, యోగా, టెన్నిస్‌ వాలీబాల్‌, చెస్‌, టేబుల్‌ టెన్నిస్‌, మార్షల్‌ ఆర్ట్‌, టెన్నిస్‌ బాల్‌ క్రికెట్‌, జిమ్నాస్టిక్స్‌, తాయిబాక్సింగ్‌, కార్ఫ్‌ బాల్‌, ఫ్లోర్‌బాల్‌, వోనియమ్‌, గ్రాప్లింగ్‌ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తారు. ఈనెల 5న ఖోఖో, అర్చరీ, బాస్కెట్‌ బాల్‌, క్యారమ్స్‌, కరాటే, స్టేకింగ్‌, మాల్‌ కాంబ్‌, ఫెన్సింగ్‌, సాఫ్ట్‌ టెన్నిస్‌, సూపర్‌ సెవన్‌ క్రికెట్‌, ఉడ్‌బాల్‌, స్పీడ్‌బాల్‌, స్వామార్షియా ఆర్ట్‌, నెట్‌ బాల్‌, స్వాష్‌, సైక్లింగ్‌, సైక్లింగ్‌ ట్రాక్‌ ఎంపికలు నిర్వహిస్తారు. ఈనెల 6న వాలీబాల్‌, బెల్ట్‌ వ్రెస్టిలింగ్‌, సాఫ్ట్‌ బాల్‌, బేస్‌బాల్‌, హాకీ, జూడో, రోలర్‌హాకీ, జీత్‌కమ్‌డూ, డ్రాప్‌బాల్‌, టెన్నిస్‌ క్రికెట్‌, బాల్‌బ్యాడ్మింటన్‌, షూటింగ్‌ యూనిఫైట్‌ ఎంపికలు నిర్వహిస్తారు.7న హ్యాండ్‌బాల్‌, టగ్‌ఆఫ్‌వార్‌,బీచ్‌ వాలీబాల్‌, టార్గెట్‌బాల్‌, వెయిట్‌ లిఫ్టింగ్‌, రోప్‌ స్కిప్పింగ్‌, రోల్‌ బాల్‌, కుడో, షూటింగ్‌బాల్‌, బాక్సింగ్‌, డోడ్జ్‌బాల్‌, క్రికెట్‌, ట్యాంగ్‌ సూడో, లగారి,అథ్లెటిక్స్‌, టెబ్‌ సూసర్‌ క్రీడలకు ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు.

అద్భుతాలకు నిలయం.. రామప్ప ఆలయం

● కాకతీయ హెరిటేజ్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపక సభ్యుడు పాపారావు


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాపారావు

వెంకటాపురం(ఎం): అద్భుతాలకు నిలయం రామప్ప దేవాలయమని కాకతీయ హెరిటేజ్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపక సభ్యుడు బి.పాపారావు అన్నారు. రామప్పలో సోమవారం జరిగిన వరల్డ్‌ హెరిటేజ్‌ వలంటీర్‌ ప్రోగ్రాంను ఎస్పీ గాష్‌ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం వద్ద రెండోసారి వలంటీర్‌ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాకతీయులు రామప్ప దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించారని వెల్లడించారు. రామప్ప దేవాలయం విశిష్టత, చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎస్పీ గాష్‌ ఆలం మాట్లాడుతూ రామప్ప ఆలయం యునెస్కో గుర్తింపు పొందడం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఎస్పీ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ శ్రీధర్‌రావు, అసిస్టెంట్‌ టూరిజం ప్రమోషన్‌ ఆఫీసర్‌ కుసుమ సూర్యకిరణ్‌, సర్పంచ్‌ డోలి రజిత, ఎస్సై తాజుద్దీన్‌, టూరిజం రీసెర్చ్‌ స్కాలర్స్‌ కొక్కుల ప్రశాంత్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌.. తప్పుల తడక..

● కేసముద్రంలో హాల్టింగ్‌ ఉందని సమాచారం
● 'షిర్డీ' ఎక్స్‌ప్రెస్‌ ఎక్కిన ప్రయాణికులు
● ఆగకుండా వెళ్లిన రైలు


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిపిన షిర్డీ ఎక్స్‌ప్రెస్‌

కేసముద్రం: 'షిర్డీ' ఎక్స్‌ప్రెస్‌కు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్‌ లేదు. అయినా ఓ యాప్‌లో హాల్టింగ్‌ చూపడంతో ప్రయాణికులు సోమవారం ఆ రైలు ఎక్కారు. తీరా ఆగకుండా వెళ్లడంతో గందరగోళానికి గురయ్యారు. 'షిర్డీ' ఎక్స్‌ప్రెస్‌కు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్‌ ఉండగా, ఇటీవల రద్దు చేశారు. అయితే ఓ యాప్‌లో హాల్టింగ్‌ ఉన్నట్లు చూపడంతో కేసముద్రంలో దిగాల్సిన ప్రయాణికులు పలు రైల్వే స్టేషన్లలో ఆ రైలు ఎక్కారు. తీరా చూస్తే డౌన్‌లైన్‌లో కేసముద్రంలో ఆగకుండా వెళ్లడంతో మహబూబాబాద్‌లో దిగారు. అలాగే, అప్‌లో లూప్‌లైన్‌ మీదుగా ఆగకుండా వెళ్తుండడంతో రైలులో ప్రయాణిస్తున్నవారితోపాటు, ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు పెట్టారు. దీంతో స్టేషన్‌లో రైలును నిలిపారు. అనంతరం యథావిధిగా ముందుకు కదిలింది. మొత్తానికి ఓ యాప్‌ తప్పుడు సమాచారం చూపడంతో గందరగోళానికి గురైనట్లు పలువురు ప్రయాణికులు తెలిపారు.

జేఎన్‌ఎస్‌లో క్రీడా సంబురం

● అట్టహాసంగా విద్యుత్‌ ఉద్యోగుల క్రీడలు ప్రారంభం
● అథ్లెటిక్స్‌, బాల్‌బ్యాడ్మింటన్‌లో తలపడనున్న క్రీడాకారులు
● ఆరు రాష్ట్రాల నుంచి 160 మంది హాజరు


క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ : 45వ ఆల్‌ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డ్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ , బాల్‌బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ సోమవారం హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియం వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణ ట్రాన్స్‌కో అండ్‌ డిస్కమ్స్‌ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పోటీలను ఎన్పీడీసీఎల్‌ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందు జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ జనాభాలో చైనాను దాటిన భారత్‌ ఇప్పుడిప్పుడే క్రీడారంగంలో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఏషియన్‌ గేమ్స్‌లో వడివడిగా పతకాలు సాధిస్తుండడం అందరికీ గర్వకారణమన్నారు. ఉద్యోగంతో పాటు క్రీడల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. దేహదారుఢ్యంగా ఉన్నప్పుడే ఉత్సాహంగా విధులు నిర్వర్తిస్తామన్నారు. క్రీడల్లో గెలుపోటమలు సహజమని, అందరూ స్ఫూర్తితో ఆడాలని సూచించారు. వరంగల్‌ క్రీడాకారుడు దివంగత పిచ్చయ్య బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రపంచ దేశాలను ఆకర్షించారని కొనియాడారు. ఈ నెల 5వ తేదీ వరకు జరుగనున్న పోటీలకు కర్నాటక పవర్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు, తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు, ఉత్తర్‌ప్రదేశ్‌ పవర్‌ సెక్టార్‌, ఆంధ్రప్రదేశ్‌ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్‌ లిమిటెడ్‌, తెలంగాణ ట్రాన్స్‌కో అండ్‌ డిస్కమ్స్‌ నుంచి 12 జట్లు, 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అంతకుముందు చిన్నారి విధాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్‌ డైరెక్టర్లు బీ వెంకటేశ్వర్‌రావు, సంధ్యారాణి, చీఫ్‌ విజిలెన్స్‌ అధికారి బి జనార్దన్‌, ఆల్‌ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డ్‌ ప్రధాన కార్యదర్శి కెఆర్‌ శివకుమార్‌, ఆల్‌ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డు సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌, స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ టీడీ కుమార్‌వడివేలు, సీజీఎం మోహన్‌రావు, వరంగల్‌ ఎస్‌ఈ మధుసూదన్‌, డీఈలు విజే ందర్‌రెడ్డి, సాంబరెడ్డి, ఆనందం, స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ జగన్నాథ్‌, కేవీ జాన్సన్‌ తదితరులు పాల్గొన్నారు.